సాక్షి మహబూబ్‌నగర్

శుక్రవారం । 19 । సెప్టెంబర్ । 2025



పేదల ప్లాట్లపై కన్ను!

కౌకుంట్లలో ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసిన ఇంటి స్థలాలను కొందరు కాజేసేందుకు ప్రయత్నిస్తున్నారు.

-8లో ▸



జూరాలకు పెరిగిన వరద

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు 1.88 లక్షల క్యూసెక్కులకు వరద పెరిగిందని అధికారులు తెలిపారు.

-8లో ▸

గరిష్టం/కనిష్టం
34.7 /22.2

వాతావరణం

అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

బాధ్యతలు స్వీకరించిన అదనపు కలెక్టర్



జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): అదనపు కలెక్టర్‌గా మధుసూదన్‌నాయక్ గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఏఓ సువర్ణరాజ్‌తోపాటు కలెక్టరేట్‌లోని వివిధ సెక్షన్ల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని మండలాల తహసీల్దార్లతో రెవెన్యూ సదస్సులు, భూ భారతి దరఖాస్తులు, ఓటర్ జాబితా 2025లో నమోదు, చేర్పులు, మార్పుల దరఖాస్తులు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ భవనం లీకేజీ, మరమ్మతుకు అంచనాలు రూపొందించాలని ఆర్‌అండ్‌బీ ఏఈని ఆదేశించారు.

డీసీసీబీ సీఈఓ నియామకం నిలిపివేత

సాక్షి, నాగర్‌కర్నూల్/ మహబూబ్‌నగర్ (వ్యవసాయం): మహబూబ్‌నగర్ జిల్లా కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ లిమిటెడ్ సీఈఓ నియామకాన్ని నిలిపివేస్తూ రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉత్తర్వులు జారీ చేసింది. సీఈఓ నియామకానికి అవసరమైన నిబంధనలు పాటించకపోవడంతో ఆయన నియామకాన్ని నిరాకరించినట్లు తెలుస్తోంది. మహబూబ్‌నగర్ డీసీసీబీ సీఈఓగా డి.పురుషోత్తమరావును ఈ ఏడాది జూలై 14న నియమించాలని కోరుతూ కమిటీ పంపిన ప్రతిపాదనను ఆర్బీఐ తిరస్కరిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. దీనిపై డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి స్పందిస్తూ సీఈఓ నియామకానికి సంబంధించిన ప్రతిపాదనను మాత్రమే ఆర్బీఐ తిరస్కరించిందని, నియామక ప్రక్రియలో ఎలాంటి అవకతవకలు జరగలేదని పేర్కొన్నారు.

హంస @ రూ.1,744

దేవరకద్ర: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం జరిగిన టెండర్లలో హంస ధాన్యం క్వింటాల్‌కు రూ.1,744 ఒకే ధర లభించింది. మార్కెట్‌కు వంద బస్తాల ధాన్యం అమ్మకానికి వచ్చింది. ప్రస్తుతం మార్కెట్‌కు రైతులు కత్తెర పంట కింద సాగు చేసిన వరి దిగుబడులను అమ్మకానికి తెస్తున్నారు.

టీఏలకు పే స్కేల్ అమలు చేయాలి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): మహాత్మగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్లకు పే స్కేల్ అమలు చేయాలని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్ అన్నారు. గురువారం జిల్లాకేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించి.. నూతన కమిటీని ఎన్నుకున్నారు. టెక్నికల్ అసిస్టెంట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా శివప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్వర్లు, కోశాధికారిగా రవీందర్, ఉపాధ్యక్షులుగా కరుణాసాగర్, ఈశ్వర్, హరిసింగ్, సుజాత, ఆంజనేయులు, కార్యదర్శులుగా లతకుమారి, కృష్ణ, ముఖ్య సలహాదారులుగా విజయ్‌భాస్కర్, విష్ణువర్ధన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, నర్సింహాచారి, ఆనంద్‌గౌడ్, మోసిన్, సుజన్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు శివప్రసాద్ మాట్లాడుతూ ఉపా ధి హామీ పథకంలో గత 20 ఏళ్లుగా పనిచేస్తున్నా తమ సమస్యలు పరిష్కరించడం లేదన్నారు. డీఆర్‌డీఓ పరిధిలో ఒకే గొడుగు కింద పనిచేస్తున్న ఐకేపీ ఉద్యోగులకు ప్రభుత్వం పే స్కేల్ ఇచ్చిందని, తమకు మాత్రం ఇవ్వకుండా అన్యాయం చేస్తుందని మండిపడ్డారు. టీఏల సమస్యలు పరిష్కరించేందుకు తనవంతుగా కృషిచేస్తానన్నారు.



కోడూరు చౌరస్తా వద్ద జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

యూరియా కొరతను నిరసిస్తూ రైతులు గురువారం మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని ధర్మాపూర్, కోడూరు, కోటకదిర గ్రామాల మీదుగా ఉన్న జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. వారం రోజులుగా యూరియా కోసం తిరుగుతున్నా, రేపు వస్తాయంటూ ప్రతిరోజూ అదే సమాధానం చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గంటల తరబడి రోడ్డుపైనే బైఠాయించడంతో రహదారిపై రాయిచూర్ వైపు, మహబూబ్‌నగర్ వైపు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. కలెక్టర్ రావాలంటూ మరికొంత మంది రైతులు నినాదాలు చేయడంతో జిల్లా సహాయ వ్యవసాయ శాఖ అధికారి రాంపాల్ కోటకదిర దగ్గరకు చేరుకుని యూరియా వస్తుందని, అందుకు తగిన టోకెన్లు తీసుకోవాలని సూచించడంతో రైతులు అక్కడి నుంచి వెళ్లారు. అప్పాయిపల్లి గ్రామ శివారులో గల సహకార సంఘానికి 600 బస్తాల యూరియా రాగా రైతులు వందల సంఖ్యలో తరలివచ్చారు. జడ్చర్లలోనూ రైతుల ఆందోళనలు, రాస్తారోకోలు కొనసాగాయి.

ఇంకెన్నాళ్లు.. యూరియా పాట్లు

- పీఏసీఎస్‌లు, రైతువేదికల వద్ద రైతుల పడిగాపులు
- రోజంతా ఎదురుచూసినా ఒక్క బస్తా దొరకని వైనం
- జిల్లాలో నిత్యకృత్యమైన ధర్నాలు, రాస్తారోకోలు
- టోకెన్లు ఇచ్చి.. చేతులు దులుపుకొంటున్న అధికారులు
- అదును మించిపోతోందని అన్నదాతల ఆందోళన

జిల్లాకు రావాల్సిన యూరియా వివరాలు (మె.ట.)

నెల	అవసరం	వచ్చింది	రావాల్సింది
ఆగస్టు	9,036	6,513	2,523
సెప్టెంబర్	7,700	788	6,912



మహబూబ్‌నగర్ (వ్యవసాయం): యూరియా కష్టాలు ఇప్పట్లో తీరేలా కనిపించడం లేదు. వరి పంటకు యూరియా వేసే సమయం మించిపోయి.. సీజన్ ముగింపు దశకు చేరుకొంటున్నా సరిపడా సరఫరా చేయడంలో అధికార యంత్రాంగం విఫలమవుతోంది. దశాబ్దకాలంలో ఎన్నడూ లేనంతగా ఈసారి తీవ్రమైన కొరత నెలకొంది. దీంతో యూరియా కోసం రైతులు రోజంతా రైతువేదికలు, పీఏసీఎస్‌లు, గోదాంల వద్ద పడిగాపులు కాయడం, క్యూలైన్లలో బారులుదీరడం.. చివరికి దొరకకపోతే రోడ్డెక్కి ఆందోళనలు, ధర్నాలు చేయడం నిత్యకృత్యమైంది. వానాకాలం వ్యవసాయ పనుల్లో నిమగ్నం కావాల్సిన రైతులు యూరియా కోసం రైతువేదికలు, పీఏసీఎస్‌ల వద్ద పడిగాపులు కాస్తూ.. రోడ్లపై ధర్నాలు చేయాల్సిన పరిస్థితి దాపురించింది. ఒక బస్తా కోసం రైతులు గంటల తరబడి ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొంది. పంటలకు సకాలంలో యూరియా తప్పనిసరిగా వేయాలని, లేకపోతే దిగుబడిపై ప్రభావం చూపుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ సీజన్‌కు సంబంధించి జిల్లాకు 38,787 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉంచాల్సి ఉండగా, ఇప్పటి వరకు 25,755 మెట్రిక్ టన్నులే సరఫరా చేయడంతో కొరత ఏర్పడుతుంది.

పెరిగిన వరి సాగు..

ప్రస్తుత వానాకాలం సీజన్‌లో జిల్లావ్యాప్తంగా 3,55,237 ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. గతేడాదితో పోలిస్తే వరి సాగు పెరగగా.. పత్తి సాగు తగ్గింది. గత వానాకాలంలో వరి సాగు విస్తీర్ణం 1,94,983 ఎకరాలు ఉండగా.. ఈసారి 2,16,605 ఎకరాల్లో సాగవుతున్నట్లు అంచనా. సన్నాలకు ప్రభుత్వం రూ.500 ప్రోత్సాహకం ఇస్తుండటంతో అంచనాలకు మించి రైతులు వరి సాగు చేస్తున్నారు. గతేడాది పత్తి సాగు విస్తీర్ణం 82,344 ఎకరాలు ఉండగా.. ఈసారి 80,482 ఎకరాలకు పరిమితం చేశారు. అలాగే మొక్కజొన్న, జొన్న, కంది పంటల సాగు పెరిగింది. జిల్లాలో ప్రధానంగా వరి, పత్తి, మొక్కజొన్న పంటలు సాగవుతుండగా.. వరి, మొక్కజొన్నకు రెండు విడతలు, పత్తికి ఒక విడత యూరియా చల్లాల్సి ఉంటుంది. అయితే జూలైలో తొలి దఫా, ఆగస్టులో రెండో దఫా యూరియా అవసరం ఉన్నా నిల్వలు లేకపోవడంతో రైతులు సకాలంలో వేయలేకపోయారు. ఇక రోజుల తరబడి బస్తాల కోసం రాత్రనకా.. పగలనకా పడిగాపులు కాస్తున్నారు. జిల్లాకు ప్రభుత్వం యూరియా కేటాయింపులు తగ్గించడమే ఈ సమస్యకు ప్రధాన కారణమని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

9,435 టన్నులు అవసరం

ప్రస్తుత సెప్టెంబర్ నెలలో యూరియా సమస్య గట్టెక్కాలంటే 9,435 మెట్రిక్ టన్నులు అవసరం. జిల్లాకు 38,787 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయాల్సి ఉంది. గత ఆగస్టులోనూ సరిపడా నిల్వలు సరఫరా లేకపోవడంతోనే పెద్దఎత్తున ఆందోళనలు నెలకొన్నాయి. ఆగస్టులో 2,523 మెట్రిక్ టన్నుల సరఫరా నిలిచిపోయింది. ఇప్పుడు సెప్టెంబర్‌లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తుంది. వెనువెంటనే రావాల్సిన నిల్వలపై దృష్టిపెడితే రైతుల సమస్యలను పరిష్కరించవచ్చు. జూన్, జూలై మాసాల్లోనూ యూరియా కేటాయింపులు తగ్గించడంతో నిల్వలు లేకుండాపోయాయి. లారీల్లో వస్తున్న యూరియా బస్తాలు నిమిషాల్లోనే కానరాకుండా పోతున్నాయి. దీంతో ఆందోళన చేస్తున్న వారికి అధికారులు రేపు వస్తాయని, ఇప్పుడు టోకెన్లు ఇస్తామని చేతులు దులుపుకొంటున్నారు.



జడ్చర్లలో రోడ్డుపై ఆందోళన చేస్తున్న రైతులు

పంపిణీలో అక్రమాలు సహించం

జడ్చర్ల: రైతులకు యూరియా పంపిణీలో కొందరు చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారని, రైతులకు దక్కాల్సిన యూరియా పంపిణీలో అక్రమాలను సహించబోమని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఇకపై సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది ద్వారా రైతులకు స్వయంగా టోకెన్లు జారీ చేయాలని సూచించారు. నవాబుపేటలో ఓ డీలర్ ఎలాంటి టోకెన్లు లేకుండా ఇష్టం వచ్చిన వారికి పంపిణీ చేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై అధికారులు విచారణ జరపాలని ఆదేశించారు. కేంద్రం నుంచి సకాలంలో యూరియా సరఫరా కాకపోవడం, అధిక విస్తీర్ణంలో పంటలు సాగవడంతో యూరియా కొరత ఏర్పడిందన్నారు. ఎక్కడైనా అవకతవకలు జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని రైతులకు విజ్ఞప్తి చేశారు.

ఏం తోచడం లేదు..



రెండున్నర ఎకరాల్లో వరి వేశా. నాటు వేసిన తర్వాత ఒకసారి యూరియా చల్లిన, రెండోసారి కలుపు తీసి యూరియా వేయడానికి సొసైటీ, ఫర్టిలైజర్ షాపుల చుట్టూ తిరుగుతున్నా దొరకడం లేదు. ఈ రోజు తెల్లవారుజామున 5 గంటలకు వచ్చి క్యూలో నిల్చున్నా ఒక్క బస్తా కూడా దొరకలేదు. వరి ఎదుగుదల కోసం యూరియా చాలా అవసరం. ఇప్పుడు ఏం చేయాలో తోచడం లేదు.

– హరిజన ఆశన్న, రైతు, కోడూరు గ్రామం, మహబూబ్‌నగర్ రూరల్

పట్టించుకుంటలేరు..



రెండెకరాల్లో వరి పంట సాగు చేస్తున్న. నాట్లేసి రెండు నెలలు అవుతుంది. ఇంత వరకు యూరియా వేయలేదు. పంట మొత్తం పాడైతుంది. ఇంతగానం కష్టపడితే ఫలితం లేకుండ అయ్యింది. ఇదేం ప్రభుత్వం. రైతులు ఆత్మహత్య జేసుకునే కాలానికొచ్చింది. పరిస్థితి ఘోరంగా ఉంది. రోడ్లమీదికెక్కే పరిస్థితికి వచ్చింది. ఎవరూ రైతుల గురించి పట్టించుకుంటలేరు.

– కట్ట చంద్రయ్య, రైతు, పర్దీపూర్ గ్రామం, చిన్నచింతకుంట మండలం

మైనార్టీ గురుకులాల్లో సీఓఈ ప్రారంభం



బాలికల కళాశాలలో సీఓఈ సెంటర్‌ను ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని మైనార్టీ బాలికల జూనియర్ కళాశాల–1లో ఏర్పాటు చేసిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ సెంటర్ (సీఓఈ)ను గురు వారం అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వి ద్యార్థులు పట్టుదలతో ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. అదేవిధంగా దేవరకద్ర మైనార్టీ బాలుర జూనియర్ కళాశాలలో సీఓఈను జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి శంకరాచారి, ఆర్ఎల్‌సీ ఖాజా బాహుద్దీన్ ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో అధికారులు జమీర్‌ఖాన్, మసూద్, జహీర్, సలీం, బాలికల–1 కళాశాల ప్రిన్సిపాల్ హాజిరాబేగం, దేవరకద్ర బాలుర–2 కళాశాల ప్రిన్సిపాల్ రహెమతుల్లా తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ కళా భవనం సందర్శన

మహబూబ్‌నగర్ రూరల్: జిల్లాకేంద్రంలోని అంబేడ్కర్ కళాభవన్ ప్రాంగణంలో ఉర్దూ ఘర్ భవనం నిర్మించొద్దని కళా భవనం పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రాలు ఇచ్చారు. ఈ మేరకు గురువారం అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ అంబేడ్కర్ కళా భవన్‌ను సందర్శించారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాల ప్రతినిధుల సమక్షంలో అదనపు కలెక్టర్ విచారణ చేపట్టగా.. ఉర్దూ ఘర్ భవనం నిర్మించొద్దని దళిత సంఘాల ప్రతినిధులు తేల్చిచెప్పారు. ఆయన వెంట అర్బన్ తహసీల్దార్ ఘన్సీరాం, కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, జెడ్పీసీఈఓ, ఎస్సీ కార్పొరేషన్ ఇన్‌చార్జి ఈడీ వెంకట్‌రెడ్డి, శంకరాచారి, సునీత తదితరులున్నారు.

ఆస్తిపన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే ఆరు నెలలు గడిచిపోయినందున ఆస్తిపన్ను లక్ష్యాన్ని చేరుకునేందుకు అందరూ దృష్టిపెట్టాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. గురువారం రాత్రి మున్సిపల్ కార్పొరేషన్ సమావేశ మందిరంలో వార్డు ఆఫీసర్లతోపాటు రెవెన్యూ విభాగం అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. మొత్తం ఆస్తిపన్ను రూ.52 కోట్లకు గాను ఇంత వరకు రూ.29 కోట్లే వసూలు కావడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతిఒక్కరూ విధిగా 60 డివిజన్ల పరిధిలో ఇంటింటికీ తిరిగి గడువులోగా వీలైనంత ఎక్కువగా వసూలు చేయాలన్నారు. మొండి బకాయిదారుల వద్దకు అవసరమైతే తనతోపాటు ఏఎంసీ, ఆర్‌ఓలు సైతం వస్తామన్నారు. మున్సిపల్ షాపుల అద్దెలను కూడా వసూలు చేయాలన్నారు. సమావేశంలో ఏఎంసీ అజ్మీరా రాజన్న, ఆర్‌ఓలు మహమ్మద్ ఖాజా, యాదయ్య, ఆర్‌ఐలు రమేష్, టి.నర్సింహ, ముజీబుద్దీన్, అహ్మద్‌షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛత కార్యక్రమాల పరిశీలన

పెద్దచెరువు వద్ద న్యూటౌన్ వైపు వరద కాల్వలో పేరుకుపోయిన ప్లాస్టిక్, ఇతర వ్యర్థ పదార్థాలను స్వచ్ఛతా హీ కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయం మున్సిపల్ సిబ్బందితోపాటు ఎల్‌డీఎం భాస్కర్ తొలగించారు. అలాగే బస్టాండు సమీపంలోని స్కౌట్స్ అండ్ గైడ్స్ భవనం ఆవరణలో పిచ్చిమొక్కలను తొలగించారు. ఆయా ప్రాంతాలను మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తనిఖీ చేసి సిబ్బందికి సూచనలిచ్చారు. ఆయా కార్యక్రమాల్లో ఆర్‌ఓ మహమ్మద్ ఖాజా, హెల్త్ అసిస్టెంట్ వజ్రకుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

వేలం పాటలతో రూ.2.02 కోట్ల ఆదాయం



కురుమూర్తిస్వామి ప్రధాన ఆలయం

చిన్నచింతకుంట: కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాలు, జాతర ఉత్సవాలను పురస్కరించుకొని అధికారులు నిర్వహించిన వేలం పాటలు గురువారం ముగిశాయి. ఈ వేలం పాటలలో ఆలయానికి రూ.2,02,75,000 ఆదాయం సమకూరింది. స్వామివారి బ్రహ్మోత్సవాలు, జాతర ఉత్సవాలతో పాటు ఏడాది పొడవునా ఆలయం వద్ద కొబ్బరికాయలు, లడ్డు ప్రసాదం విక్రయించడానికి, కొబ్బరి చిప్పలు, తలనీలాలు సేకరణ, లైటింగ్, డెకరేషన్ ఏర్పాట్లు, పూలు, పూజ సామగ్రి విక్రయం, జాతరలో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడానికి ప్రతి సంవత్సరం వేలం పాటలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగానే ఈ సంవత్సరం ఆలయం వద్ద పలు దఫాలుగా వేలం పాటలు నిర్వహించగా కొబ్బరికాయలు, పూజ సామగ్రికి సరైన పాట రాకపోవడంతో వాయిదా పడుతూ వచ్చాయి. ఈ మేరకు గురువారం మహబూబ్‌నగర్‌లోని దేవాదాయ శాఖ కార్యాలయంలో అధికారులు వేలం పాటలు నిర్వహించారు. ఇందులో కొబ్బరికాయలు రూ.56.25 లక్షలు, పూజా సామగ్రి రూ.16.50 లక్షలు, లడ్డు ప్రసాదం రూ.46 లక్షలు, తల వెంట్రుకలు రూ.32 లక్షలు, కొబ్బరి చిప్పలు రూ.4.62 లక్షలు, లైటింగ్, డెకరేషన్ రూ.13.33 లక్షలు, ఎగ్జిబిషన్ రూ.34.5 లక్షలు పలికాయి. కాగా.. గతేడాది మొత్తం వేలం పాటలలో రూ1,72,56,000 ఆదాయం రాగా గతేడాది కంటే ఈసారి రూ.30.19 లక్షలు ఎక్కువ వచ్చింది.

కోయిల్‌సాగర్‌లో 32.3 అడుగుల నీటిమట్టం

దేవరకద్ర: జిల్లాలో ప్రధాన సాగునీటి ప్రాజెక్టు అయిన కోయిల్‌సాగర్ జలాశయంలో గురువారం సాయంత్రం వరకు నీటిమట్టం 32.3 అడుగులకు చేరుకుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 32.6 అడుగులు కాగా.. మరో 0.3 అడుగుల నీరు చేరితే గేట్లు తెరిచే అవకాశం ఉంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 2.27 టీఎంసీలకు గాను ప్రస్తుతం 2.2 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ప్రాజెక్టుకు ఎగువ నుంచి వచ్చే పెద్దవాగు ప్రవాహం తగ్గడంతో నీటిమట్టం నిలకడగా ఉంటుంది.

కృష్ణాతీరానికి సొబగులు

- కృష్ణానది పరివాహకంలో టూరిజం అభివృద్ధికి నిధులు
- అమరగిరి, సోమశిలలో వసతుల కల్పనకు చర్యలు
- నిర్మాణ పనులు చేపట్టేందుకు ఆసక్తి చూపుతున్న కన్సల్టెన్సీలు
- పర్యాటక గ్రామాలకు వెళ్లే రహదారుల ఏర్పాటుకు శ్రీకారం



సోమశిల సమీపంలో కృష్ణానది అందాలు

కొల్లాపూర్: ఉమ్మడి పాలమూరు జిల్లాలోని కృష్ణానది తీరంలో పర్యాటకానికి మహర్దశ పట్టింది. ఇప్పటికే సోమశిల పర్యాటక ప్రాంతంగా విరాజిల్లుతుండగా.. కృష్ణానది తీరం వెంట ఉండే ఇతర ప్రాంతాలను కూడా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చర్యలు చేపట్టాయి. అందులో భాగంగా పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నాయి.

నిధుల కేటాయింపు..

వెల్‌నెస్ అండ్ స్పిరిచ్యువల్ రిట్రీట్ ప్రాజెక్టులో భాగంగా కొల్లాపూర్ మండలం అమరగిరిలో పర్యాటక అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఇటీవలే ప్రభుత్వం రూ.45.84 కోట్లు కేటాయించింది. ఈ నిధులతో అమరగిరి సమీపంలోని మల్లయ్య సెల, నడింతిప్ప ప్రాంతాల్లో కృష్ణానది మధ్యలో గల దీవిలో పర్యాటకులను ఆకట్టుకునేలా నిర్మాణాలు చేపట్టబోతున్నారు. ఇక్కడ యోగా డెక్, పెవిలియన్, స్పా ఏరియా, కాటేజీలు, సిబ్బంది వసతి గృహాలు, స్విమ్మింగ్‌పూల్, ఇండోర్, అవుట్ డోర్ యాక్టివిటీస్, వ్యూయింగ్ డెక్, స్టోర్ రూంలు, బోట్లు నిలిపేందుకు జెట్టీలు, వివిధ రకాల చెట్లతో గార్డెనింగ్ వంటి పనులు సుందరంగా చేపట్టనున్నారు. అదేవిధంగా సోమశిలలో వీఐపీ ఘాట్‌కు పర్యాటకుల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో రూ.1.60 కోట్లతో ఘాట్ విస్తరణ, బోటింగ్ వసతులు మెరుగుపర్చే పనులు చేపట్టనున్నారు. ఈ పనులకు ఇటీవలే రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు శంకుస్థాపన చేశారు.

కన్సల్టెన్సీలతో సంప్రదింపులు..

పర్యాటక అభివృద్ధి పనులు చేపట్టేందుకు పలు కన్సల్టెన్సీలు ముందుకు వస్తున్నాయి. హైదరాబాద్ తోపాటు ఇతర నగరాలకు చెందిన పలు కంపెనీల ప్రతినిధులు పర్యాటక శాఖ అధికారులను సంప్రదించారు. ఆకట్టుకునే విధంగా నిర్మాణాలు చేపట్టే వారికే ఈ పనులు అప్పగించాలనే యోచనలో అధికారులు ఉన్నారు. అయితే కొన్ని రోజులుగా కన్సల్టెన్సీల ప్రతినిధులు అమరగిరి ప్రాంతాన్ని సందర్శిస్తున్నారు.

హెలీ టూరిజంతో ప్రాముఖ్యత..

సోమశిల నుంచి శ్రీశైలం వరకు హెలీ టూరిజం ప్రారంభిస్తామని ఇటీవల రాష్ట్ర పర్యాటకశాఖ ప్రకటించింది. దీంతో ఈ ప్రాంతం మరోసారి వార్తల్లోకెక్కింది. నల్లమల అడవి, కృష్ణానది అందాలు తిలకిస్తూ సాగే హెలీ టూరిజంపై పర్యాటకులు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే నదిలో లాంచీ ప్రయాణం ఏర్పాటు చేయగా..హెలీ టూరిజం ఏర్పాటుతో జాతీయస్థాయి పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది.

పనుల అప్పగింతపై చర్చలు..

సోమశిల, అమరగిరిలో పర్యాటక అభివృద్ధి పనులు కన్సల్టెన్సీలకు అప్పగించనున్నారు. ఇందుకు సంబంధించిన చర్చలు జరుగుతున్నాయి. కొల్లాపూర్‌ను పర్యాటకంగా అభివృద్ధి చేయాలనే సంకల్పంతో మంత్రి జూపల్లి కృష్ణారావు ఉన్నారు. అమరగిరిలో విదేశీ పర్యాటకులను ఆకట్టుకునేలా నిర్మాణాలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు అందాయి. కృష్ణానది తీరం వెంట ఉండే పర్యాటక ప్రాంతాల్లో బోటింగ్ సౌకర్యాన్ని మరింత మెరుగుపర్చేందుకు కూడా చర్యలు తీసుకుంటున్నాం.

– నర్సింహ, జిల్లా పర్యాటకశాఖ అధికారి, నాగర్‌కర్నూల్

రహదారుల నిర్మాణం..

కొల్లాపూర్ నియోజకవర్గంలో పర్యాటక ప్రాంతాలు అనేకం ఉన్నాయి. వీటిలో సోమశిల, అమరగిరి, మంచాలకట్ట, జటప్రోల్, సింగోటం వంటి ప్రాంతాలకు పర్యాటకులు అధికంగా వస్తున్నారు. అమరగిరిలో పెద్దఎత్తున పర్యాటక అభివృద్ధి పనులు చేపట్టనున్న నేపథ్యంలో ఆ గ్రామానికి వెళ్లే రహదారిని బాగుచేసేందుకు చర్యలు ప్రారంభించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో రూ.2.80 కోట్లతో అమరగిరికి వెళ్లే రోడ్డు నిర్మాణానికి మంత్రి జూపల్లి కృష్ణారావు భూమిపూజ చేశారు. రోడ్డు వెంట ఉన్న కల్వర్టుల నిర్మాణాలు పూర్తయ్యాయి.

కొత్తకోట తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ దాడి

- ఇనాం భూమి ఓఆర్సీ కోసం రూ.40 వేలు లంచం డిమాండ్
- ఆర్‌ఐ, డిప్యూటీ సర్వేయర్‌ను అదుపులోకి తీసుకున్న అధికారులు



ఏసీబీ అధికారులకు పట్టుబడిన ఆర్‌ఐ వాసు, డిప్యూటీ సర్వేయర్ నవీన్‌రెడ్డి

కొత్తకోట రూరల్: రోజూ ఏదో ఒకచోట ఏసీబీ అధికారులకు ప్రభుత్వ అధికారులు చిక్కుతూనే ఉన్నారు. తాజాగా గురువారం వనపర్తి జిల్లా కొత్తకోట తహసీల్దార్ కార్యాలయంపై ఏసీబీ అధికారులు దాడి చేశారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని నిర్వేన్‌కు చెందిన ఓ రైతు తన ఇనాం భూమి ఓఆర్సీ కోసం తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోగా తహసీల్దార్ విచారణకు ఎంఆర్ఐ వాసు, డిప్యూటీ సర్వేయర్ నవీన్‌రెడ్డిని ఆదేశించారు. వీరిద్దరు భూమి చూడటానికి రూ.40 వేలు లంచం డిమాండ్ చేయగా బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. గురువారం మధ్యాహ్నం తర్వాత తహసీల్దార్ కార్యాలయంలో సోదాలు నిర్వహించి ఆర్‌ఐ వాసు, డిప్యూటీ సర్వేయర్ నవీన్‌రెడ్డిని అదుపులోకి తీసుకొని విచారించారు. లంచం డిమాండ్ చేసినట్లు అన్ని ఆధారాలు లభించడంతో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ తెలిపారు. వీరిని శుక్రవారం హైదరాబాద్ నాంపల్లి ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపర్చనున్నట్లు వివరించారు. ప్రభుత్వ శాఖల్లో పనిచేసే అధికారులు, ఉద్యోగులు లంచం అడిగితే హెల్ప్‌లైన్ నంబర్ 1064కు లేదా ఏసీబీ వాట్సాప్ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని, వివరాలను గోప్యంగా ఉంచుతామని చెప్పారు. దాడిలో ఏసీబీ సీఐలు లింగస్వామి, ఎస్‌కే జిలాని, కిషన్‌నాయక్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పేదల స్థలాలపై కన్ను..!

కొన్నేళ్ల క్రితం ప్రభుత్వం పరిహారం చెల్లించి కొందరి నుంచి భూమిని సేకరించింది. అనంతరం ఆ భూమిని ప్లాట్లుగా మార్చి పేదలకు పట్టాలు సైతం పంపిణీ చేసింది. ఇటీవల ఆ ప్లాట్లను ప్రభుత్వం నుంచి పరిహారం పొంది భూమిని విక్రయించిన యజమానుల వారసులు కబ్జా చేశారు. కోర్టును సైతం తప్పుదారి పట్టించి లబ్ధిదారులను ప్లాట్ల వద్దకు రానివ్వకుండా చేస్తుండడంతో.. తమకు న్యాయం చేయాలని దేవరకద్ర నియోజకవర్గంలో నూతనంగా మండలంగా ఏర్పడిన కౌకుంట్లకు చెందిన దాదాపు 206 మంది పేదలు కోరుతున్నారు.

– దేవరకద్ర రూరల్


పట్టాలను చూపిస్తున్న లబ్ధిదారులు

- కౌకుంట్లలో 206 మందికి ప్రభుత్వం ప్లాట్ల పంపిణీ
- ఆ భూమి మాదంటూ కోర్టును తప్పుదారి పట్టిస్తున్న కొందరు
- న్యాయం కోసం లబ్ధిదారుల ఎదురుచూపులు

దేవరకద్ర నియోజకవర్గం కౌకుంట్లకు చెందిన 206 మంది ప్లాట్ల యజమానులు తమ న్యాయం చేయాలంటూ కోర్టును, అధికారులను ఆశ్రయించారు. గతంలో పరిహారం చెల్లించి పేదల ప్లాట్ల కోసం ప్రభుత్వం కొనుగోలు చేసిన భూమిని తిరిగి భూమికి సంబంధించిన యజమాని వారసులు తప్పుడు సమాచారంతో కోర్టును పక్కదారి పట్టించి తిరిగి లాక్కునేందుకు ప్రయత్నిస్తున్నారని, పూర్తిస్థాయి విచారణ చేసి మాకు న్యాయం చేయాలని కోరుతున్నారు. లబ్ధిదారులు తెలిపిన వివరాల ప్రకారం...

1984లో ప్లాట్ల పంపిణీ

1984లో అప్పటి ప్రభుత్వం పేదలకు ప్లాట్లు ఇవ్వాలని నిర్ణయించుకొని కౌకుంట్లలోని సర్వే నెంబర్‌లోని 435, 436లో ఏడుగురిపై ఉన్న 24–35 ఎకరాలకు గాను, 15–84 ఎకరాలను భూమిని సేకరించింది. అనంతరం ఆత్మకూర్ తహసీల్దార్‌తో భూమి అక్విజేషన్ చేసి అప్పటి విలువ ప్రకారం ప్రభుత్వం రూ.63 వేలను భూ యజామానులకు పరిహారం చెల్లించింది. అనంతరం అదే భూమిలో 12–34 ఎకరాలలో కౌకుంట్లలోని 206 మంది పేదలకు ప్లాట్లు చేసి పట్టాలు సైతం అందజేసింది. పొజిషన్ చూపకపోవడంతో వారికి ఇళ్లు మంజూరు కాలేదు. ఈ విషయంపై లబ్ధిదారులు అప్పుడే అధికారులను కోరినా వారు స్పందించలేదు. ఇదిలాఉండగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం సదరు భూమి విక్రయించిన వారికి పరిహారం అందించింది. అయితే, ఈ సర్వే నంబర్లను గత రెవెన్యూ అధికారులు రికార్డులో తొలగించకపోవడంతో గతంలో భూమి విక్రయించిన వారికి సైతం పరిహారం అందింది. దీంతో వారి వారసులు భూమి ఇంకా తమ వారి పేరుపై ఉండటాన్ని గమనించి 2015లో హైకోర్టును ఆశ్రయించి తమకు అనుకూలంగా తీర్పు తెచ్చుకుని భూమిని సేద్యం చేస్తున్నారు. అక్కడికి వెళ్లిన లబ్ధిదారులకు కోర్టు తీర్పును చూపించి బయటకు పంపించారు. దీంతో లబ్ధిదారులు గతంలో ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ తమ దగ్గర ఉన్న ఆధారాలతో ప్రస్తుతం కోర్టును ఆశ్రయించారు.

మాయమైన అవార్డు కాపీ

బాధితులు కోర్టును ఆశ్రయించడంతో భూమికి సంబంధించిన పూర్తి వివరాలు అందించాలని కోర్టు కలెక్టర్‌కు, సంబంధిత అధికారులకు సూచించింది. కోర్టు ఆదేశాల మేరకు అధారాలు వెతుకుతున్న క్రమంలో 2022 లో దేవరకద్ర తహసీల్దార్ కార్యాలయంలో నాటి ఏడుగురు భూయజమానులలో ఒకరిపై ఉన్న ఫైల్ నెం.డి2/ 5256/1983 ప్రకారం 3–70 ఎకరాలకు సంబంధించిన అవార్డు ప్రొసిడింగ్ లభించింది. 12–34 ఎకరాల భూమికి సంబంధించిన డి2/ 3006/2984 అవార్డు కాపీ మాత్రం లభించలేదు. దీనికోసం అధికారులు అప్పటి రిజిస్ట్రేషన్ జరిగిన ఆత్మకూర్ తహసీల్దార్, ఫైల్ కాపీ కోసం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో వెతికినా కూడా దొరకలేదు. భూసేకరణకు సంబంధించి అన్ని వివరాలు లభించినప్పటికి ఫైల్‌లో కేవలం అవార్డు కాఫీకి సంబంధించిన పేపర్ మాయం అవడం గమనార్హం. అప్పట్లో ఇదే శాఖలో పనిచేసిన దేవరకద్ర మండలానికి చెందిన ఓ రెవెన్యూ ఉద్యోగి పాత్ర ఇందులో ఉండవచ్చని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. అధికారులు పూర్తి వివరాలు కోర్టుకు అందించి తమకు న్యాయం చేయాలని లబ్ధిదారులు కొరుతున్నారు.

వివరాలు పంపించాం



కోర్టు, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కౌకుంట్లలోని 435–436 సర్వే నెంబర్‌లకు సంబంధించిన వివరాలు పంపించాం. భూమికి సంబంధించి అవార్డు కాఫీ లభించనప్పటికి మా దగ్గర ఉన్న మిగతా అన్ని వివరాలు కలెక్టర్ కార్యాలయంలో అందజేశాం.

– సుందర్‌రాజ్, తహసీల్దార్, కౌకుంట్ల

భూమి మాది అంటున్నారు



గతంలో ప్రభుత్వం మా తండ్రి నీలి ఆశన్నకు గ్రామంలో ప్లాటు కేటాయించింది. అయితే పొజిషన్ చూపించడంలో అధికారులు నిర్లక్ష్యం చేశారు. ఈ విషయంపై అధికారులను ఎన్నిసార్లు అడిగినా స్పందించలేదు. ఇన్నేళ్ల తరువాత ఇప్పుడు వారి వారసులు వచ్చి భూమి మాది అంటున్నారు. అధికారులు పారదర్శకంగా విచారణ చేసి న్యాయం చేయాలి.

– నీలి శ్రీనివాసులు, కౌకుంట్ల

ప్లాట్లు ఇప్పించండి



1984లో ప్రభుత్వం మాకు ప్లాటు ఇచ్చింది. అందుకు సంబంధించిన పట్టాను సైతం అధికారులు అందించారు. అక్కడే ఇల్లు కూడా ప్రభుత్వం తరుపున కట్టిస్తామని చెప్పారు. కానీ ఆ మామీ అమలు కాలేదు. అప్పుడు భూమి అమ్ముకున్నవారు ఇప్పుడు మాది అంటున్నారు. పేదలకు న్యాయం చేసి మా ప్లాట్లు మాకు అందించాలి.

– అబ్దుల్లా, లబ్ధిదారుడు, కౌకుంట్ల

న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నాం..




గతంలో ప్రభుత్వం కౌకుంట్లలో భూమిని కొనుగోలు చేసి 206 మంది బీసీలు, మైనార్టీలకు ప్లాట్లు కేటాయించింది. అధికారులు ఎన్నిసార్లు అడిగినా పొజీషన్ చూపించలేదు. ఇది అవకాశంగా తీసుకొని భూమికి సంబంధించిన యజమానులు కోర్టును ఆశ్రయించి తీర్పు తమ వైపు తెచ్చుకున్నారు. లబ్ధిదారులు దగ్గర ఉన్న అధారాలతో న్యాయస్థానాన్ని ఆశ్రయించాం. న్యాయం జరుగుతుందనే నమ్మకంతో ఉన్నాం..

– సాంబశివుడు, టీయూసీయూ జిల్లా కార్యదర్శి

పనిచేసిన చోటే కన్నం

- దుకాణంలో రూ. 4లక్షల నగదు చోరీ
- ఏడుగురి అరెస్టు.. రిమాండ్
- మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

మహబూబ్‌నగర్ క్రైం: ఆర్థిక ఇబ్బందులతో తాను పనిచేసిన యాజమాని దుకాణంలో చోరీ చేయాలని పథకం వేసి.. స్నేహితులతో కలిసి భారీ మొత్తంలో నగదు కాజేశాడో వ్యక్తి. ఈ కేసుకు సంబంధించిన వివరాలను గురువారం జిల్లా కేంద్రంలోని రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన ప్రెస్‌మీట్‌లో డీఎస్పీ వెంకటేశ్వర్లు వెల్లడించారు. కోయిలకొండ మండలం వీరన్నపల్లికి చెందిన మోడిపాటి వదన్న కొన్ని రోజులపాటు కోయిలకొండకు చెందిన అబ్దుల్ అజీజ్ చౌష్ బజావీ వద్ద వ్యవసాయ కూలీగా పని చేసేవాడు. ఆ తర్వాత అతడి వద్ద పని మానివేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడం మొదలుపెట్టాడు. ఈ క్రమంలో మోడిపాటి వదన్నకు ఆర్థిక ఇబ్బందులు మొదలయ్యాయి..దీంతో గతంలో పనిచేసిన యాజమాని దుకాణంలో దొంగతనం చేయాలని పథకం వేసి.. బాలానగర్ మండలం ఏక్వాయిపల్లికి చెందిన ముష్టి శ్రీనివాస్‌ను సంప్రదించాడు. ఆ తర్వాత ముష్టి శ్రీనివాస్ తన స్నేహితులైన వాల్యానాయక్ తండాకు చెందిన ఆటో డ్రైవర్లు ముడావత్ సురేశ్, కాట్రావత్ సురేశ్, జడ్చర్ల పాత బజార్‌కు చెందిన మేస్త్రీ మాణిమారి శేఖర్, గద్వాలకు చెందిన ఉప్పల ఉదయ్‌కుమార్‌తో కలిసి దొంగతనం చేయడానికి పథకం వేశారు. ఈ నెల 11న అర్ధరాత్రి కోయిలకొండలో ఉన్న అబ్దుల్ అజీజ్ చౌష్ బజావీ దుకాణంలో ఉన్న రూ.4లక్షల నగదు, ఒక కేజీ బరువు ఉండి బంగారం పూతకల్గిన గొలుసు చోరీ చేశారు. ఈ నెల 19న బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కోయిలకొండ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. దర్యాప్తులో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలోని కోయిలకొండ క్రాస్‌రోడ్డులో బంగారం పూత కలిగిన గొలుసు విక్రయించడానికి నిర్మల్‌కు చెందిన రాజేంద్రప్రసాద్‌తో కలిసి మిగిలిన ఆరుగురు ప్రయత్నం చేస్తున్న క్రమంలో అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. రాజేంద్ర ప్రసాద్‌పై నిర్మల్ జిల్లాలో పలు కేసులు ఉన్నాయి. అదుపులోకి తీసుకున్న ఏ–1 మోడిపాటి వదన్న, ఏ–2 ముష్టి శ్రీనివాసులు, ఏ–3 ముడావత్ సురేశ్, ఏ–4 కాట్రావత్ సురేశ్, ఏ–5 మణిమారి శేఖర్, ఏ–6 ఉప్పల ఉదయ్‌కుమార్, ఏ–7 రాజేంద్ర ప్రసాద్‌లను అరెస్టు చేసి.. వారి నుంచి రూ. 3.10లక్షల నగదు, ఒక కేజీ బంగారం పూతకల్గిన గొలుసు, ఐరన్ రాడ్లు, రెండు కార్లు సీజ్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. వారిని కోర్టులో హాజరుపర్చగా రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో రూరల్ సీఐ గాంధీనాయక్, ఎస్‌ఐ తిరుపాజీ ఉన్నారు.

జూరాల వంతెనపై ఆందోళన


జూరాల జలాశయంపై ఆందోళన చేస్తున్న నందిమళ్ల, రేవులపల్లి గ్రామస్తులు

- పాత జీఓ ప్రకారమే హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలన్న నందిమళ్ల, రేవులపల్లి గ్రామస్తులు
- మూడుగంటల పాటు నిలిచిన రాకపోకలు

అమరచింత: పాత జీఓ ప్రకారమే నందిమళ్ల నుంచి రేవులపల్లి వరకు నదిపై హైలేవల్ వంతెన నిర్మించాలంటూ నందిమళ్ల, రేవులపల్లి గ్రామస్తులు గురువారం జూరాల జలాశయంపై ఆందోళన చేపట్టారు. ఆయా గ్రామాల వివిధ రాజకీయ పార్టీల నాయకులు మాట్లాడుతూ.. జూరాల ప్రాజెక్టు సందర్శనకు వచ్చిన భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మంత్రి వాకిటి శ్రీహరి డ్యాం సమీపంలోని నందిమళ్ల నుంచి రేవులపల్లి వరకు కృష్ణానదిపై రూ.120 కోట్లతో వంతెన నిర్మిస్తామని హామీ ఇచ్చారని, ఇందుకు సంబంధించిన జీఓ సైతం ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ప్రస్తుతం ఆత్మకూర్ మండలం జూరాల గ్రామం మీదుగా వంతెన నిర్మాణానికి అనుమతులు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. జూరాల ప్రాజెక్టు నిర్మాణంలో సమీప గ్రామాలైన నందిమళ్ల, కిష్టంపల్లి, ఈర్లదిన్నె, మిట్టనందిమళ్ల, చింతరెడ్డిపల్లి, రేవులపల్లి తదితర గ్రామస్తులు వ్యవసాయ భూములు, ఇళ్లు కోల్పోయారన్నారు. డ్యాం కోసం సర్వం త్యాగం చేసిన ఆయా గ్రామస్తులకు మేలు చేయకుండా హైలేవల్ వంతెనను అకారణంగా మార్చడం తగదన్నారు. నందిమళ్ల సమీపంలో వంతెన నిర్మిస్తే నారాయణపేట, రాయిచూర్, వనపర్తి, మహబూబ్‌నగర్ ప్రాంతాల వర్తకులకు ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. రియల్ వ్యాపారం కోసమే కొందరు ఇక్కడికి మంజూరైన వంతెనను జూరాలకు తరలిస్తున్నారని ఆరోపించారు. బ్రిడ్జి నిర్మాణ స్థలం మారిస్తే పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. మూడు గంటల పాటు రాస్తారోకో చేయడంతో రాకపోకలు నిలిచి ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, సంజీవ్, రమేష్, చింతలన్న, రవి, రాజు, మురళి, ప్రసాద్, మధు తదితరులు పలువురు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైలు ఢీకొని వృద్ధురాలి మృతి

గద్వాల క్రైం: రైలు ఢీకొట్టిన ప్రమాదంలో వృద్ధురాలు మృతి చెందినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ అశోక్‌కుమార్ తెలిపారు. వడ్లవీధికి చెందిన కురువ గోవిందమ్మ(70) మతిస్థిమితం సమస్యతో బాధపడుతుంది. ఈ క్రమంలో గురువారం తెల్లవారు జామున రైల్వేస్టేషన్ సమీపంలో రైల్వే ట్రాక్‌పై నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి కుమారుడు రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ యువతి మృతి


భార్గవి అలియాస్ పవిత్ర (ఫైల్)

ఊట్కూరు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువతి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. దామరగిద్ద మండలం సజనాపూర్‌కు చెందిన భార్గవి అలియాస్ పవిత్ర(21) ఊట్కూరు మండలం మల్లెపల్లికి చెందిన లింగప్పతో 4 నెలల క్రితం వివాహమైంది. ఈ నెల 9న భార్యాభర్తలు శుభకార్యానికి వెళ్తుండగా కొండూరు స్టేజీ సమీపంలో ఆటో బోల్తాపడడంతో భార్గవికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ గురువారం తెల్ల వారుజామున మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి తండ్రి హనుమంతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అచ్చంపేట రూరల్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ విజయ్‌భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. బల్మూర్ మండలం అంబగిరికి చెందిన అర్జున్(35) ఈనెల 11న అమ్రాబాద్ మండలానికి వెళ్తుండగా రంగాపూర్ వద్ద రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. గురువారం అతని భార్య అంజలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. అతనికి భార్యతో పాటు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

కారు ఢీకొని మహిళ దుర్మరణం

రాజాపూర్: కారు ఢీకొని ఓ మహిళ మృతిచెందిన ఘటన గురువారం సాయంత్రం మండల కేంద్రం శివారులో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. నర్సింగ్‌తండా గ్రామపంచాయతీ పరిధిలోని ఇబ్రహింపల్లికి చెందిన సంతోష (40) రాజాపూర్ శివారులో జాతీయ రహదారి పక్కన జామకాయలు విక్రయించుకుంటూ జీవనం సాగించేది. రోజు మాదిరిగా గురువారం కూడా జామకాయలు విక్రయిస్తుండగా జడ్చర్ల నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108 వాహనంలో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. తమ్ముడు యాదయ్య ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ శివానందంగౌడ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృత్యువాత

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి దుర్మరణం చెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. సుమారు 40 ఏళ్లలోపు వయసున్న గుర్తుతెలియని వ్యక్తి మూసాపేట సమీపంలో హైదరాబాద్‌వైపు నుంచి కర్నూల్ వైపు వెళ్లే రోడ్డును దాటుతుండగా.. గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో అతడికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. నడిరోడ్డుపై మృతదేహం పడిపోవడంతో కర్నూలు రోడ్డుపై వాహనాలు నిలిచిపోయాయి. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. మృతదేహాన్ని మార్చురీకి తరలించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. దీనిపై విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎం.వేణు తెలిపారు.

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి

గోపాల్‌పేట: విద్యాదాఘాతంలో పంచాయతీ కార్మికుడు మృతి చెందిన ఘటన రేవల్లి మండల కేంద్రంలో గురువారం జరిగింది. ఎస్‌ఐ రజిత తెలిపిన వివరాలు.. రేవల్లి మండల కేంద్రానికి చెందిన టప్ప సత్యం(58) పంచాయతీ కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఉదయం ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. గ్రామ సమీపంలోని ఎల్లయ్య పొలంలో పందుల కోసం కోసం పెట్టిన కరెంటు వైర్లు చుట్టుకొని పడి ఉన్నట్లు గుర్తించిన స్థానికులు సత్యం కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న కుటుంబ సభ్యులు, పోలీసులు సత్యం మృతి చెంది ఉండటాన్ని గుర్తించారు. మృతుడి భార్య నర్సమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.


లింక్‌ను క్లిక్ చేస్తే.. ఖాతాలో డబ్బులు మాయం

అచ్చంపేట రూరల్: టెలిగ్రామ్‌లో వచ్చిన లింక్‌ను క్లిక్ చేయగా ఖాతాలోని డబ్బులు మాయమైన సంఘటన అచ్చంపేట పట్టణంలో గురువారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన నరేష్ ఈనెల 16న టెలిగ్రామ్‌లో ఓ లింక్ వచ్చింది. రూ.30వేలు పెట్టుబడి పెడితే రూ.50వేలు వస్తాయని లింక్‌లో సమాచారం ఉండటంతో లింక్ నొక్కాడు. తర్వాత మరో రూ.6వేలు పంపాలని సందేశం రావడంతో అనుమానం వచ్చి ఖాతాలోని డబ్బులు చూస్తే రూ.30వేలు మాయమైనట్లు గ్రహించాడు. గురువారం బాధితుడి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విజయ్‌భాస్కర్ తెలిపారు.

2 ఇసుక లారీలు పట్టివేత

అలంపూర్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు లారీలను గురువారం పట్టుకున్నట్లు ఉండవెల్లి ఎస్‌ఐ శేఖర్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. బ్లూకోల్ట్ సిబ్బంది అనిల్‌కుమార్, రవి తెల్లవారుజామున 3 గంటల సమయంలో జాతీయ రహదారిపై విధులు నిర్వర్తిస్తుండగా.. కర్నూలు వైపు నుంచి వచ్చిన ఇసుక లారీని తనిఖీ చేయగా ఎలాంటి పత్రాలు లేకపోవడంతో అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. నంద్యాల జిల్లా ప్యాపిలికి చెందిన లారీ డ్రైవర్ రాముడు, తాడిపత్రికి చెందిన యజమాని మల్లికార్జున్‌రెడ్డిపై కేసు నమోదు చేశారు. అదేవిధంగా అదే మార్గంలో తెల్లవారు జామున 4 గంటల ప్రాంతంలో వచ్చిన మరో లారీని పట్టుకొని అనంతపూర్‌లోని పుట్లూర్‌కు చెందిన లారీ డ్రైవర్ విశ్వనాథ్, యజమాని రామ్మోహన్‌పై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

ట్రాక్టర్‌పై నుంచి పడి డ్రైవర్ మృతి


భరత్‌కుమార్ (ఫైల్)

వనపర్తి రూరల్: ఇసుక ట్రాక్టర్‌పై నుంచి పడి ఓ యువకుడు మృతిచెందాడు. ఎస్‌ఐ యుగేందర్‌రెడ్డి వివరాల మేరకు.. పెబ్బేరు మండలం వై.శాఖాపూర్ గ్రామానికి చెందిన పగిడాల భరత్ కుమార్ (29) బుధవారం రాత్రి గ్రామ సమీపంలోని ఊకచెట్టు వాగు నుంచి ఇసుక నింపుకొని బయల్దేరాడు. మార్గమధ్యంలోని పెద్దగుట్ట వద్ద ట్రాక్టర్ అదుపుతప్పి ఓ బండరాయిని ఎక్కడంతో డ్రైవింగ్ సీటులో నుంచి అతడు ఎగిరిపడి టైరు కింద పడ్డాడు. ప్రమాదంలో అతడికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య శిరీష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులను వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి పరామర్శించి.. రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు.

జూరాలకు 1.88 లక్షల క్యూసెక్కుల వరద


జూరాల ప్రాజెక్టు నుంచి 22 క్రస్టు గేట్ల ద్వారా దిగువకు పారుతున్న వరద నీరు

- 26 క్రస్టు గేట్ల ఎత్తి దిగువకు నీటి విడుదల

ధరూరు/ రాజోళి/ ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వరద భారీగా పెరిగింది. గురువారం రాత్రి 10 గంటల వరకు ప్రాజెక్టుకు వస్తున్న ఇన్‌ఫ్లో 1.88 లక్షల క్యూసెక్కులకు పెరగడంతో 26 క్రస్టు గేట్లను ఎత్తి 1,77,710 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అలాగే విద్యుదుత్పత్తి నిమిత్తం 30,400 క్యూసెక్కులు, నెట్టెంపాడుకు 750, భీమా లిఫ్టు–1కు 650, ఎడమ కాల్వకు 1,030, కుడి కాల్వకు 570, భీమా లిఫ్టు–2కు 750 క్యూసెక్కులు వదలగా.. మరో 45 క్యూసెక్కులు ఆవిరైంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 8.126 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

సుంకేసులలో మూడు గేట్లు..

సుంకేసుల డ్యాం వద్ద మూడు గేట్ల ద్వారా నీటి విడుదల చేస్తున్నట్లు జేఈ మహేంద్ర తెలిపారు. గురువారం ఎగువ నుంచి 17,250 క్యూసెక్కుల ఇన్ ఫ్లో రాగా.. మూడు గేట్లను ఒక మీటర్ మేర ఎత్తి.. 13,236 క్యూసెక్కులు దిగువకు, కేసీ కెనాల్ కు 2,445 క్యూసెక్కులు వదిలినట్లు ఆయన పేర్కొన్నారు.

లక్ష్యానికి మించి విద్యుదుత్పత్తి

జూరాలలోని జల విద్యుత్ కేంద్రాల ద్వారా ఈ ఏడాది లక్ష్యానికి మించి విద్యుదుత్పత్తి చేపడుతున్నారు. కాగా.. గురువారం ఎగువలో 6 యూనిట్ల ద్వారా 234 మెగావాట్లు, దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు విద్యుదుత్పత్తి చేపట్టామని ఎస్ఈ శ్రీధర్ తెలిపారు.

పోతుల పద్మావతికి స్థానిక ధ్రువపత్రం జారీ



గట్టు: మాజీ మావోయిస్ట్, కేంద్ర కమిటీ సభ్యురాలు పోతుల పద్మావతి అలియాస్ కల్పన, అలియాస్ సుజాతక్కకు గట్టు రెవెన్యూ అధికారులు స్థానిక ధ్రువీకరణ పత్రాన్ని గురువారం జారీ చేశారు. ఆమె కుటుంబ సభ్యులు రెవెన్యూ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోగా ఆర్ఐ రాజు, అధికారులు గ్రామానికి చేరుకుని విచారణ చేసి నివేదికను తహసీల్దార్‌కు అందజేశారు. తహసీల్దార్ విజయ్‌కుమార్ పోతుల పద్మావతి పెంచికలపాడు గ్రామానికి చెందిన వ్యక్తిగా స్థానికత ధ్రువీకరణ పత్రాన్ని జారీ చేశారు. 42 ఏళ్లు మావోయిస్టు పార్టీలో పని చేసిన పద్మావతి అంచెలంచెలుగా ఎదిగి కేంద్ర కమిటీ సభ్యురాలిగా పని చేశారు. ఆమె ఆరోగ్యం సహకరించకపోవడంతో ఇటీవల పోలీసుల ఎదుట లొంగిపోయిన విషయం తెలిసిందే. పోలీసులు పునావాసం కింద ఆమెకు రూ. 25 లక్షల రివార్డు అందజేశారు. అయితే ఆమె ఇప్పటికి గ్రామానికి చేరుకోలేదు.గ్రామస్తులు, కుటుంబ సభ్యులు ఆమె రాక కోసం ఎదురు చూస్తున్నారు.

గంజాయి సాగుచేసిన వ్యక్తికి రిమాండ్


గంజాయి సాగు వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీను

గట్టు: మండలంలోని బోయలగూడెం గ్రామ శివారులో గంజాయి సాగుచేసిన వ్యక్తిని పోలీసులు అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. ఇందుకు సంబంధించిన వివరాలను గురువారం గద్వాల పోలీసు సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో సీఐ శ్రీను, ఎస్‌ఐ మల్లేశ్ వెల్లడించారు. అయిజ మండలం తోత్తినోనిదొడ్డి గ్రామానికి చెందిన బస్వాపురం ప్రాణేశ్ బోయలగూడెం శివారులోని సర్వే నంబర్ 382/1లో కౌలుకు తీసుకున్న పొలంలో మిరప, పత్తిపంట సాగుచేశాడు. ఈ పంటల మధ్య 9 గంజాయి మొక్కలను పెంచాడు. 5నుంచి 6 ఫీట్ల ఎత్తులో ఒక్కొక్కటి 3 కేజీలు ఉన్న గంజాయి మొక్కలను పోలీసులు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్టు చేసి, కోర్టులో హాజరుపర్చగా రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

గృహహింస కేసు నమోదు

గద్వాల క్రైం: కుటుంబ సభ్యుల వేధింపులు తాళలేక మనస్థాపం చెందిన మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసిన ఘటనలో నలుగురుపై కేసు నమోదు చేసినట్లు పట్టణ రెండవ ఎస్‌ఐ సతీష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పట్టణానికి చెందిన మాధురికి రాఘవేంద్రతో 9 ఏళ్ల క్రితం వివాహమైంది. వివాహమైన కొద్ది రోజుల నుంచి మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నట్లు తెలిపారు. భర్తతో పాటు కుటుంబ సభ్యులు సైతం అకారణంగా వేధిస్తున్నారని ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

నిందితులకు రిమాండ్ పొడిగింపు

గద్వాల క్రైం: తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన తేజేశ్వర్ హత్య కేసు ఘటనలో రిమాండ్‌లో ఉన్న నిందితులను గురువారం పోలీసులు గద్వాల జూనియర్ సివిల్ కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి ఉదయ్‌నాయక్ నిందితులు ఏ–1 తిరుమలరావు, ఏ–2 ఐశ్వర్య అలియాస్ సహస్రలకు మరో 14 రోజులపాటు రిమాండ్ విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు. కాగా.. ఈ కేసులో ఏ–3 కుమ్మరి నగేష్, ఏ–4 చాకలి పరశురాముడు, ఏ–5 చాకలి రాజు, ఏ–6 ఎ.మోహన్, ఏ–7 తిరుపతయ్య, ఏ–8 సుజాతలకు గత వారం రోజుల క్రితం జిల్లా న్యాయమూర్తి షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేశారు. ఏ–1, ఏ–2లకు న్యాయవాదులు బెయిల్ పిటిషన్ దాఖలు చేయగా న్యాయమూర్తి నిరాకరించారు.

ఇరువురి మధ్య ఘర్షణ.. కౌంటర్ కేసు నమోదు

మహబూబ్‌నగర్ క్రైం: ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన గొడవలో వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కౌంటర్ కేసు నమోదు అయ్యింది. వన్‌టౌన్ సీఐ అప్పయ్య కథనం ప్రకారం.. జిల్లాకేంద్రంలోని పాత పాలమూరుకు చెందిన భరత్ బుధవారం రాత్రి ఇంటి దగ్గర ఉన్న సమయంలో అదే కాలనీకి చెందిన శివ అనే యువకుడితో ఫోన్‌లో మాట్లాడుతున్న క్రమంలో ఇద్దరి మాటల యుద్ధం నడిచింది. ఆ తర్వాత మద్యం మత్తులో శివ పాత పాలమూరులోని భరత్ ఇంటికి చేరుకున్నాడు. ఇద్దరూ గొడవ పడుతుండగా స్థానికులు సర్దిచెప్పే క్రమంలో శివ చేతిలో ఉన్న బీరుసీసా పగిలిపోయి అతని చెయ్యికి రక్త గాయాలు అయ్యాయి. ఈ ఘటనపై ఇద్దరూ ఇచ్చిన ఫిర్యాదులతో కౌంటర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

‘ఏదుల’ నుంచి నీటి తరలింపు సరికాదు

నాగర్‌కర్నూల్: పాలమూరు–రంగారెడ్డి పరిధిలోని ఏదుల రిజర్వాయర్ నుంచి డిండికి నీటిని తరలించే ప్రతిపాదన సరికాదని.. విరమించుకోవాలని మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. ఈ లేఖలో పలు విషయాలు ప్రస్తావించారు. శ్రీశైలం ముందరి తీరం నీటిని నల్గొండ జిల్లాలోని దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాల్లో 3.41 లక్షల ఎకరాలకు అందించేలా డిండి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రతిపాదనలో ఉందన్నారు. పాలమూరు–రంగారెడ్డి ద్వారా రంగారెడ్డి, నల్గొండ, పాలమూరు జిల్లాలోని 12.30 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని.. ఏదుల నుంచి నీటిని తరలిస్తే ఇక్కడి ప్రజలకు అన్యాయం జరుగుతుందని, ఈ ప్రాంత రైతులు చట్టబద్ధ హక్కు కోల్పోతారని తెలిపారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో 36 లక్షల ఎకరాల సాగు భూమి ఉంటే ప్రస్తుతం ఉన్న ప్రాజెక్టుల నుంచి 7 నుండి 8 లక్షల ఎకరాలకు మాత్రమే నీరందుతుందన్నారు. నల్గొండలో 24.7 లక్షల ఎకరాల సాగు భూమి ఉంటే అక్కడి ప్రాజెక్టుల ద్వారా 17 లక్షల ఎకరాలకు నీరందుతుందని.. వెంటనే ప్రతిపాదనను వెనక్కి తీసుకొని ఈ ప్రాంత ప్రజలకు న్యాయం చేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

- ఢీకొన్న రెండు తుఫాన్ వాహనాలు



దోమలపెంట: రెండు తుఫాన్ వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు గాయాలపాలైన ఘటన శ్రీశైలం ప్రధాన రహదారిలో దోమలపెంట వద్ద గురువారం జరిగింది. ఈగలపెంట ఎస్‌ఐ జయన్న తెలిపిన వివరాలు.. మహారాష్ట్రకు చెందిన భక్తులు శ్రీశైలం దర్శనం అనంతరం తిరుగు ప్రయాణంలో ఉండగా కర్ణాటక రాష్ట్రం రాయచూర్‌కు చెందిన భక్తులు శ్రీశైలం వస్తున్నారు. ఈ క్రమంలో దోమలపెంట నుంచి ఈగలపెంటకు వెళ్తున్న రహదారిలో స్తూపం సమీపంలోని దర్గా వద్ద రెండు తుఫాన్ వాహనాలు ఎదురెదురుగా ఢీకొట్టుకున్నాయి. ప్రమాదంలో మహారాష్ట్రకు చెందిన కారులో ఉన్న ముగ్గురు వ్యక్తులు స్వల్పంగా గాయపడినట్లు తెలిపారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.